



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 47 | శనివారం 12 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## మయన్మార్‌లో 4.5 తీవ్రతతో భూకంపం

**నేపిడా (మయన్మార్) –సూర్య వాస్తవం, జూలై 11:**

మయన్మార్‌లో శుక్రవారం భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 4.5గా నమోదైందని ఎన్‌సిఎస్ (నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం 10.40 గంటల సమ యంలో భూకంపం సంభవించింది. వెడల్పు : 24.78, పొడవు : 94.85, లోతు : 85.. మయన్మార్‌లో భూకంపం సంభవించినట్లు ఎన్‌సిఎస్ ఎక్స్ ట్వీట్‌లో పేర్కొంది.



## ఇజ్రాయిల్ దాడులకు 55 మంది పాలస్తీనియన్లు మృతి

**గాజా –సూర్య వాస్తవం, జూలై 11:**

గురువారం తెల్లవారుజాము నుండి ఇజ్రాయిల్ దళాలు గాజాపై దాడుల్ని ప్రారంభించాయి. గురువారం వైమానిక, భూతల దాడులకు గాజాలో 55 మంది పాలస్తీనియన్లు మృతి చెందినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఈ దాడులపై ఐక్యరాజ్యసమితి తీవ్రంగా విమర్శించింది. ఇజ్రాయిల్ ఇంధనాన్ని నిలిపివేయడం వల్ల విద్యుత్ సరఫరా ఆగిపోయి ఆసుపత్రుల్లో రోగులు చనిపోతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు.





## హైకోర్టులో సిద్ధరామయ్యకు ఊరట

2లో

- కాంగ్రెస్ నేతలపై బీజేపీ పరువునష్టం దావా
- 'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ దావా
- కేసును తాత్కాలికంగా నిలిపివేసిన హైకోర్టు



## ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం...

- నీట మునిగిన పలు గ్రామాలు
- మహారాష్ట్ర, తెలంగాణలో వర్షాలు
- గోదావరికి పోటెత్తుతున్న వరద నీరు
- ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తివేత

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### దేశానికి బలమైన

# ఆర్థికవనరు జనాభే....

సీఎం చంద్రబాబు



- ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని ఆ సినిమాలో చూపించారు : సీఎం చంద్రబాబు
- ప్రపంచ జనాభా దినోత్సవంపై అమరావతిలో సమ్మిట్
- హాజరైన సీఎం చంద్రబాబు - జనాభా పెరగాలని పిలుపు

**అమరావతి –సూర్య వాస్తవం, జూలై 11:**

దేశానికి బలమైన ఆర్థికవనరు జనాభేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జనాభా పెరుగుదలకు త్వరలో మంచి పాలసీ తీసుకొస్తామని అన్నారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన గురజాడ అప్పారావు స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాడు ఎన్టీఆర్ తాతమ్మ కల అనే సినిమా తీశారని, ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని అందులో చూపించారని వివరించారు.

పిల్లలను కనే వరం భగవంతుడు మహిళలకు ఇచ్చాడని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర సచివాలయం వద్ద ప్రపంచ జనాభా దినోత్సవంపై మొదటి అమరావతి సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనాభా నిర్వహణా విధానం ప్రతి కుటుంబం ముఖ్యం–మీ అభిప్రాయం మార్గదర్శనం అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన సర్వేను సీఎం ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రత్యుత్పత్తి రేటు పెరగాలి**

ఒకప్పుడు జనాభా పెద్ద సమస్యగా ఉండేది. 2004కు ముందు సీఎంగా ఉన్నప్పుడు జనాభా నియంత్రణకు ప్రోత్సాహకాలు ఇచ్చాను. ఇద్దరు పిల్లల కంటే ఎక్కుమంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చేస్తూ చట్టాన్ని తెచ్చాను. ఇప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులుగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. దేశం అంటే రాష్ట్రాలు, ప్రాంతాలు, పట్టణాలు, సరిహద్దులు, భూభాగాలు మాత్రమే కాదు, దేశం అంటే మనుషులు.

**మన బలం మానవ వనరులు**

ఈ రోజు ప్రపంచంలో 10 నుంచి 24 ఏళ్ల వయసు ఉన్నవారు 1.8 బిలియన్లు ఉన్నారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారు. కానీ జనాభా ఉన్న దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోంది. జనాభా ఎప్పటికీ భారం కాదు...అదే మనకు తిరుగులేని ఆస్తి. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో అభివృద్ధి సాధ్యమా అనే పరిస్థతి నుంచి ఆ జనాభానే మనకు అడ్వాంటేజ్‌గా మారింది. 140 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశం చైనాను కూడా వెనక్కు నెట్టింది.

**యువశక్తి తగ్గి... వృద్ధులు పెరుగుతున్నారు**

ఏ దేశంలోనైతే వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేట్ నిలిచిపోతుంది. భవిష్యత్‌లోనూ సమస్యలు వస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేట్ పడిపోతోంది. అమెరికాలో 1.62 శాతం, యూకేలో

- మిగతా 2లో..

### రాజధాని నిర్మాణంపై

# మాటతప్పిన మోడీ

- కేంద్రాన్ని నిలదీయడంలో చంద్రబాబు విఫలం
- మరో 44 వేల ఎకరాల సమీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల


**తుళ్లూరు–సూర్య వాస్తవం, జూలై 11:**

రాజధాని ప్రాంతంలో అభివృద్ధి లేదని, మౌలిక సదుపాయాలు కూడా కల్పించడంలేదని, పిచ్చి మొక్కలు మాత్రమే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని చెప్పి ప్రధాని మాట తప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు, రాజధానిని కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో ఆమె శుక్రవారం పర్యటించారు. మోడీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని, రాజధాని నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోడీ శంకుస్థాపన చేసిన ప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, పిచ్చి మొక్కలు పెరిగాయే తప్ప అభివృద్ధి లేదన్నారు. పదేళ్ల తర్వాత




రెండోసారి శంకుస్థాపన చేయడం ఎబ్బెట్టుగా ఉందని తెలిపారు. 2014లో రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి 33 వేల ఎకరాలు, మరో 21 వేల ఎకరాల ప్రభుత్వ భూములు కలిపి 54 వేల ఎకరాలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు మరో 44 వేల ఎకరాలు కావాలని అడుగుతున్నారని, ఆ భూములతో చంద్రబాబు

- మిగతా 2లో..



## నా తండ్రి నాకు ఇచ్చిన ఆస్తి ఇదే

- చదువుకు మించిన ఆస్తి లేదన్న అనిత
- తన తండ్రి తనకు ఇచ్చిన ఆస్తి చదువేనని వెల్లడి
- అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన

**అమరావతి –సూర్య వాస్తవం, జూలై 11:**

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, తప్పుడు పోస్టులు పెట్టేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సామాజిక మాధ్యమాల పట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరినీ తల్లిదండ్రులు సమానంగా చూడాలని అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.తాను ఒకప్పుడు టీచర్ అని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడతానని అనిత అన్నారు. తన తండ్రి

- మిగతా 2లో..

# హైకోర్టులో సిద్ధరామయ్యకు ఊరట

- కాంగ్రెస్ నేతలపై బీజేపీ పరువునష్టం దావా
- 'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ దావా
- కేసును తాత్కాలికంగా నిలిపివేసిన హైకోర్టు

బెంగళూరు– సూర్య వాస్తవం, జూలై 11

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో భారీ ఉరట లభించింది. ఆయనపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసును హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. 2023 ఎన్నికల సమయంలో... 'అవినీతి రేటు కార్డు' ప్రకటనపై బీజేపీ పరువునష్టం కేసు దాఖలు చేసింది. ఇందులో సిద్ధరామయ్య, రాహుల్ గాంధీ, డీకే శివకుమార్ పేర్లను చేర్చింది. బీజేపీ లంచం తీసుకున్నట్టు 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వంలో పదవులు, కాంట్రాక్టులకు లంచాల రేట్లను నిర్ణయించిందని ఆరోపించింది. ఈ ప్రకటన ద్వారా తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశారంటూ బీజేపీ పరువునష్టం దావా వేసింది. ఈ కేసును ధర్మాసనం తాత్కాలికంగా నిలిపివేయడంతో కాంగ్రెస్ నేతలకు భారీ ఊరట లభించింది.

# ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం...

- నీట మునిగిన పలు గ్రామాలు
- మహారాష్ట్ర, తెలంగాణలో వర్షాలు
- గోదావరికి పోటెత్తుతున్న వరద నీరు
- ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తివేత

మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద తాకిడి పెరగడంతో అధికారులు బ్యారేజీ మొత్తం 175 గేట్లను ఎత్తేశారు. దీంతో 2,00,600 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళుతోంది. వరద కారణంగా పలు లంక గ్రామాలు నీట మునిగాయి. కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో నీరు చేరుతోంది. నాలుగు గ్రామాలకు బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. అత్యవసరమైన వారు పడవలపై ప్రయాణం చేస్తున్నారు.

# రాజధాని నిర్మాణంపై మాటతప్పిన మోడీ

(మొదటిపేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారా..? అని నిలదీశారు. ప్రస్తుతం సమీకరించిన భూముల్లో రాజధానిని నిర్మిస్తే బంబాయి నగరం విస్తీర్ణానికి సరిపడా అవుతుందని, ఇంకా అదనంగా భూములెందుకని ప్రశ్నించారు. గన్నవరం విమానాశ్రయం రాజధాని పరిధిలోకే వస్తుందని, 5 వేల ఎకరాలతో ఇంకో ఎయిర్‌పోర్ట్ అవసరమా..? అని నిలదీశారు. రాజధాని నిర్మాణంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. భూసమీకరణకు వ్యతిరేకంగా అవసరమైతే కాంగ్రెస్ తరపున పోరాటం చేస్తామన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.53 వేల కోట్లతో టెండర్లు పిలిచినట్లు సిఎం చెబుతున్నారని, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో నుంచి రూ.31 వేల కోట్లు రుణాలు తెస్తున్నారని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునే హక్కు ఉండగా అప్పుల గొడవేమిటని నిలదీశారు. ఇప్పటికే రాష్ట్రం అప్పులు రూ.11 లక్షల కోట్లు దాటాయని, చంద్రబాబు అండతో కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నా కాలర్ పట్టుకొని నిధులిమ్మని అడగకుండా అప్పులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానులని అన్నారని, ఒక్క రాజధాని కూడా అభివృద్ధి కాలేదని విమర్శించారు.

# నా తండ్రి నాకు ఇచ్చిన ఆస్తి ఇదే

(మొదటిపేజీ తరువాయి)

తనకు ఇచ్చిన ఆస్తి చదువు అని తెలిపారు. చదువుకు మించిన ఆస్తి లేదని చెప్పారు. కనిపించే దేవత అయిన అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. తమ ప్రభుత్వంలో తల్లిదండ్రులు అందరూ చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని చెప్పారు. జగన్ పాలనలో గంజాయి ఏరులై పారేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో గంజాయి కేసుల్లో పట్టుబడితే సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ గా మార్చుదామని పిలుపునిచ్చారు. గంజాయి మత్తులో పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# జర్మనీ భాషలో ఉచిత శిక్షణ

### - మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి



**అమరావతి – సూర్య వాస్తవం, జూలై 11:** నర్సింగ్, జిఎన్ఎం చదివిన ఎస్సి నిరుద్యోగ యువతకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఎస్సి యువతకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యాన ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించను న్నట్లు చెప్పారు. మొదటి విడతలో 150 మందికి శిక్షణ ఇచ్చి అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎస్సిలలో చదువుకున్న ఏ ఒక్కరూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు.

# దేశానికి బలమైన ఆర్థికవనరు జనాభే....

(మొదటిపేజీ తరువాయి)

1.54 శాతం, హంగేరిలో 1.50 శాతం, ఫ్రాన్స్‌లో 1.49 శాతం, రష్యాలో 1.47 శాతం, జర్మనీలో 1.46 శాతం, కెనడాలో 1.33 శాతం, జపాన్‌లో 1.23 శాతం, చైనాలో 1.02 శాతం, సింగపూర్‌లో 0.96 శాతం ఉంది. సంపన్న దేశాల్లో తక్కువ జననాల రేటు కన్పిస్తోంది.

**పిల్లలను కనేవారికి విదేశాల్లో ప్రోత్సాహకాలు**

జపాన్‌లో పిల్లలు స్కూలుకు వెళ్లే వరకు చైల్డ్ కేర్ సేవలను అందించడంతో పాటు పిల్లల చదువుకు ఆర్థిక సాయం లేదా ఉచిత విద్యను అందిస్తున్నారు. ఎక్కువమంది పిల్లలుంటే ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయంతో పాటు తక్కువ రెంట్‌తో ఇల్లు అద్దెకు ఇస్తున్నారు. దక్షిణ కొరియా దేశంలో నెలవారీగా ప్రత్యక్ష నగదు బహుమతులు అందించడంతోపాటు వివాహం, కాన్పులకు, ఐవీఎఫ్ గర్భధారణకు సాయం చేస్తున్నారు. సింగపూర్ దేశంలో బేబీ బోనస్ స్కీమ్ కింద పుట్టిన ప్రతి శిశువు కోసం కొంత నగదు అందిస్తున్నారు. మ్యాచ్ సేవింగ్స్ కింద ప్రభుత్వ సొమ్మును జోడించి పిల్లల ఖాతాల్లో వేస్తున్నారు. రష్యాలో రెండవ బిడ్డను కంటే ఫ్రీ హెల్త్‌కేర్ కింద గర్భిణీలకు ఉచిత వైద్యం అందిస్తున్నారు. హంగేరీలో నలుగురు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి జీవితాంతం ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నారు. చైనాలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే రూ.12 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నారు.

**ఖర్చులు పెరుగుతున్నాయని పిల్లల్ని కనడం లేదు**

జనాభా తగ్గిపోతే వృద్ధి రేటు పడిపోతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా పెరుగుదలపై సమావేశంలో పోల్ నిర్వహిస్తే ఇద్దరు పిల్లలుండాలని 67.41 శాతం మంది, ఒకరే ఉండాలని 12.34 శాతం మంది, ముగ్గురు పిల్లలుండాలని 19.88 శాతం మంది అభిప్రాయపడ్డారని వివరించారు. పిల్లలను కనడానికి యువత ఆసక్తి చూపడం లేదని, చాలా మంది భార్యాభర్తలు పిల్లలను వద్దనుకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. ఖర్చులు పెరుగుతాయని పిల్లల్ని కనడానికి ఇష్టపడటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి... రానురాను అవి కనుమరుగవుతున్నాయి. గత కొన్నేళ్ల వరకు ఇంట్లో ప్రతి ఒక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం ఇచ్చేవాళ్లం. ఐదుగురు ఉంటే 25 కేజీలు ఇచ్చేవాళ్లం. అంతకంటే ఎక్కువమంది ఉంటే బియ్యం ఇచ్చేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఒక కుటుంబంలో పది మంది ఉన్నా 50 కేజీల కంటే ఎక్కువ ఇచ్చేదానిపై ఆలోచిస్తున్నాం. దక్షిణ భారత దేశంలో జనాభా తగ్గిపోతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో పార్లమెంటు సీట్లు పెరుగుతాయి.. కానీ దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలకు సీట్లు తగ్గిపోతాయని కొందరు ఆందోళన చెందుతు న్నారు... అని చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎమ్.ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎయిడెడ్ సిబ్బంది నియామకాలకు మార్గదర్శకాలు

**అమరావతి – సూర్య వాస్తవం, జూలై 11:** రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు జిఓ 30ను పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం విడుదల చేశారు. నియామకానికి సంబంధించిన అంశాన్ని ముందుగా పత్రికల ద్వారా తెలపాలని ప్రభుత్వం తెలిపింది. సిబ్బందికి 100 మార్కులకు పరీక్ష నిర్వహించాలంది. 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను, మిగిలిన 20 మార్కులను టెట్ వెయిట్‌ను తీసుకోవాలని పేర్కొంది. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి 0.5 మార్కుల చొప్పున పదేళ్లకు మించి ఇవ్వకూడదని తెలిపింది. డిఎస్సిలో అమలు చేస్తున్న మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అనుసరించాలని వెల్లడించింది. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని పేర్కొంది. మైనార్టీ విద్యా సంస్థలకు మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చింది.

# ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై సమీక్ష

### - విశాఖలో ఎపి లెజిస్లేచర్ కమిటీ పర్యటన




**విశాఖపట్నం –సూర్య వాస్తవం, జూలై 11:** రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మదింపుచేసి వాటి అకౌంట్ల నిర్వహణ, ఆర్థిక నిర్వహణపై నివేదికలను పరిశీలించి, వాటి నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రభుత్వానికి తమ కమిటీ సూచనలు చేస్తోందని ఎపి లెజిస్లేచర్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ చెప్పారు. ఈ కమిటీ శుక్రవారం విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైంది. పలు ప్రభుత్వ సంస్థల పనితీరుపై అధికారులతో చర్చించి, ఆయా సంస్థల నిర్వహణకు సంబంధించి వార్షిక నివేదికలు, ఆడిట్, పనితీరుకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకుంది. విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలు, చేపట్టిన ప్రాజెక్టులపై జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, శ్రీకాకుళం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యకలాపాలపై అక్కడి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..అన్ని ప్రభుత్వ సంస్థలూ తమ కార్యక్రమాలపై, అకౌంట్ల నిర్వహణ, ఆడిట్ పై పూర్తిస్థాయి సమాచారంతో నివేదికలు అందజేసినప్పుడే ప్రభుత్వానికి సరైన నివేదికలు అందించగలమని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూములు, వాటిని ఏ మేరకు సద్వినియోగం చేసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై కమిటీ సభ్యులు చర్చించారు. ఆయా భూములను పారిశ్రామిక వినియోగానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించినపుడు ఏ రకమైన చర్యలు చేపట్టారనే అంశంపై కూడా కమిటీ సభ్యులు ఆరా తీశారు.

# జిందాల్ రైతులకు చట్ట ప్రకారమే పరిహారం

### - విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్



**విజయనగరం –సూర్య వాస్తవం, జూలై 11:** జిందాల్ భూములకు సంబంధించి మిగిలిన రైతులకు పరిహారాన్ని వారం రోజుల్లో అందజేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిందాల్‌కు కేటాయించిన భూములకు సంబంధించి ఆయన తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు చెల్లించిన పరిహారం, పెండింగ్ బకాయిలపై ఆరా తీశారు. సుమారు 28 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం పెండింగ్‌లో ఉండగా, వీరిలో ముగ్గురికి ఇటీవలే చెల్లించినట్లు అధికారులు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మిగిలిన వారిలో 11 మందికి కూడా వారంలో పరిహారం అందజేయాలని ఆదేశించారు. భూములు తీసుకున్న సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం మాత్రమే వారికి వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. పరిహారం తీసుకోవడంలో వారే జాప్యం చేశారని, అందువల్ల చట్ట ప్రకారం పరిహారం పెరిగే అవకాశం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 53 బోరుబావులకు సంబంధించి, ఇప్పటికే 28 మందికి నష్ట పరిహారం ఇచ్చామని, మిగిలిన వారికి కూడా వెంటనే అందజేయాలని జిందాల్ ప్రతినిధులను కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల స్థలాలు కోల్పోయిన 16 మంది గురించి చర్చించారు. నిబంధనల ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల తరువాత మరోసారి సమావేశం నిర్వహిస్తామని, ఈలోగా సమస్య పూర్తిగా పరిష్కారం కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# నేటి అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



**అమరావతి –సూర్య వాస్తవం, జూలై 11:** తమ డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసనగా శనివారం అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు. ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్షులు కె నాగభూషణ, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని, కేటగిరీల నిర్ణయంలో జరిగిన తప్పులను సరిదిద్దాలని, షరతులు లేకుండా కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# వరుస విమాన ప్రమాదాలు... శిక్షణ లోపమా



భారత సైన్యంలో ఎయిర్‌ఫోర్స్ ఎంతో కీలకమైనది. మారుతున్న యుద్ధ రీతులతో ఇప్పుడు ఎయిర్‌ఫోర్స్ ప్రాధాన్యత పెరిగింది. గతంలో చేసిన సర్జికల్ స్ట్రైక్, ఇటీవల పహల్గాం ఉగ్రదాడకి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో నేవీ,ఎయిర్‌ఫోర్స్ కీలకంగా వ్యవహరించాయి. అయితే యుద్ధాల్లో మరణించిన వారిని వీరుడు అంటారు. కానీ, మన పైలట్లు.. యుద్ధం చేయకుండానే దుర్మరణం చెందుతున్నారు. ఇటీవలి శిక్షణ విమాన ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గడిచిన కొన్ని నెలల్లో జాగ్వార్, మిరాజ్ వంటి యుద్ధ విమానాలు కూలిపోవడంతో సుశిక్షిత పైలట్లు ప్రాణాలు కోల్పోతున్నారు. 2017?2022 మధ్య 20 యుద్ధ విమానాలు, ఏడు హెలికాప్టర్లు, ఆరు శిక్షణ విమానాలు, ఒక కార్గో విమానం కూలినట్టు ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. ఈ నేపథ్యంలో, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఒక పోస్టు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పాత విమానాలు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) నిర్వహణ, శిక్షణ సమస్యలపై కీలక చర్చను లేవనెత్తుతోంది.మిగ్?21 విమానాలు భారత వైమానిక దళంలో దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. 1963లో ఇంపోర్ట్‌తో ప్రారంభమై, నాసిక్‌లోని హెచ్‌ఏఎల్ వద్ద అసెంబుల్ చేయబడిన ఈ విమానాల ఉత్పత్తి 1985లో నిలిచిపోయింది. అయినప్పటికీ, ఈ 40 ఏళ్ల పాత విమానాలను అవియానిక్స్ అప్‌డేట్‌లు, నిర్వహణతో ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. ఈ విమానాలు శిక్షణ సమయంలో జరిగిన టెస్ట్ ఫ్లైట్‌లలో అనేకసార్లు కూలిపోయాయి, దీని వల్ల 170 మంది సుశిక్షిత పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. ఒక్కో పైలట్‌ను శిక్షణ ఇచ్చి, యుద్ధ విమానాన్ని నడపగలిగే స్థాయికి తీసుకురావడానికి దాదాపు 50 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా. అయినప్పటికీ, ఈ విమానాలను 2025 డిసెంబర్ వరకు సర్వీసు నుంచి తొలగించేందుకు నిర్ణయం తీసుకోవడం, నిర్వహణలో ఆలస్యాన్ని సూచిస్తుంది.మిగ్?21ల స్థానంలో జాగ్వార్ విమానాలు వస్తున్నాయి, కానీ ఇవి కూడా 1979లో ఇండక్ట్ అయిన పాత విమానాలే. హెచ్‌ఏఎల్ నిర్మించిన ఈ విమానాలు కూడా తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో ఇద్దరు యువ పైలట్లు మరణించారు, ఇది జాగ్వార్ విమానాల నిర్వహణ, ఆధునీకరణ సమస్యలపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఐదు నెలల్లో మూడు జాగ్వార్ విమానాలు కూలిపోవడం, వీటి వయస్సు, నిర్వహణలో లోపాలను సూచిస్తోంది.హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) భారత్‌లో వైమానిక రంగంలో కీలక సంస్థగా ఉన్నప్పటికీ, దాని నిర్వహణ, ఉత్పత్తి నాణ్యతపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమ పోస్టులో హెచ్‌ఏఎల్‌ను 'హిందుస్థాన్ ఆముదం లిమిటెడ్' అని వ్యంగ్యంగా పేర్కొంటున్నారు. సంస్థపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రతిబింబిస్తుంది. హెచ్‌ఏఎల్ వద్ద తయారైన విమానాలు తరచూ నిర్వహణ సమస్యలతో బాధపడుతున్నాయి, ఇది ప్రమాదాలకు ఒక కారణంగా చెప్పబడుతోంది. విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయడంతో.. ప్రయాణికుల కోసం ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఇండిగో విమానయాన సంస్థ తెలిపిందికొన్ని రోజుల క్రితమే ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. ఇండిగో సంస్థకు చెందిన విమానాన్ని పక్షి ఢీకొట్టింది. దీంతో విమానం కొంతమేర దెబ్బతింది. ఈ సంఘటన జరిగిన సమయంలో విమానంలో 175 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా ఇండిగో విమానంలో పట్నా నుంచి కోల్‌కతా వెళ్తున్నారు. ఇక గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. పక్షులు ఢీకొట్టడం వల్ల విమానంలో సాంకేతిక లోపాలు తలెత్తిన సందర్భాలు చాలా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.అదనంగా, 5వ తరం యుద్ధ విమానాలను తయారు చేస్తామని చెప్పడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విమాన ప్రమాదాలు ఎక్కువగా శిక్షణ సమయంలో జరగడం ఆందోళనకరం. యుద్ధాల కంటే శిక్షణలోనే ఎక్కువ మంది పైలట్లు ప్రాణాలు కోల్పోవడం, శిక్షణ ప్రక్రియలో లోపాలను సూచిస్తుంది. పాత విమానాలను ఉపయోగించడం, సరైన నిర్వహణ లేకపోవడం, ఆధునిక శిక్షణ సౌకర్యాల కొరత వంటివి ఈ సమస్యలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. ఒక్కో పైలట్ శిక్షణకు భారీ ఖర్చు చేస్తున్నప్పటికీ, ఈ ప్రమాదాలు ఆర్థిక, మానవ నష్టాలను కలిగిస్తున్నాయి.

## సెప్టెంబర్ 24 నుంచి బ్రహ్మోత్సవాలు

**తిరుమల – సూర్య వాస్తవం**

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ నెలలో తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. సెప్టెంబర్ 28న గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా చూడాలని టీటీడీ ఏఈవో ఆదేశించారుతిరుమల శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ నెలలో జరగనున్నాయి. సెప్టెంబర్ 24 నుంచి.అక్టోబర్ 2వ తేదీ వరకూ తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 16వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. సెప్టెంబర్ 23వ తేదీ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. సెప్టెంబర్ 24న ధ్వజారోహణం ఉంటుంది.బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహన సేవలు నిర్వహిస్తారు. ఇక తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ముఖ్యమైన గరుడ వాహన సేవను సెప్టెంబర్ 28వ తేదీ జరగనుంది. అక్టోబర్ ఒకటో తేదీ రథోత్సవం నిర్వహిస్తారు. అక్టోబర్ రెండో తేదీ చక్రస్నానంతో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. మరోవైపు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని తిరుమల తిరుపతి దేవస్థానం.. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయనుంది. అలాగే , దివ్యాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లి దండ్రులు, ఎన్‌ఆర్ఐ, దాతల దర్శనాలు కూడా రద్దు చేస్తారు.బ్రహ్మోత్సవాల సమయంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ ఏఈవో అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, మాడ వీధుల్లోని గ్యాలరీలు, ముఖ్యమైన చోట్లు శ్రీవారి భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్యాలరీల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని.. తిరుమలలో ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణలు, ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేయాలని వెంకయ్య చౌదరి ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూలు నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే గరుడ వాహన సేవ సందర్భంగా తిరుమల కొండపైకి వాహనాల రాకపోకలపైనా చర్యలు చేపట్టాలని సూచించారు



# పాదయాత్రలే తారక మంత్రమా.?

**విజయవాడ – సూర్య వాస్తవం**

వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షు జగన్మోహన్ రెడ్డి మరోసారి పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల కార్యకర్తల సమావేశంలో కూడా ఆయన ప్రకటించారు. ఇప్పుడు వైసీపీ ముఖ్య నేత పేర్ని నాని కూడా ఇదే ప్రకటన చేశారు. కృష్ణా జిల్లాలో జరిగిన పార్టీ సమావేశంలో రెండేళ్ల తర్వాత వైయస్ జగన్ పాదయాత్ర స్టార్ట్ అవుతుందిని.. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి జగన్ గారు వస్తారు.. మీతో మాట్లాడతారని పేర్ని నాని తెలిపారు ప్లీనరీ తర్వాత జిల్లా మీటింగ్స్.. ఆ తర్వాత పాదయాత్ర ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలతో నేరుగా సంబంధం బలోపేతం చేయడం, యువతను సమీకరించ డానికి జగన్ పాదయాత్ర చేయాలనుకుంటున్నారు.

జగన్ ఈ పాదయాత్రను 2029 ఎన్నికలకు ముందు పార్టీని పునరుద్ధరించేందుకు ఒక వ్యూహంగా ఖరారు చేసుకున్నారు. ఈ పాదయాత్ర జిల్లా స్థాయి సమావేశాలు , ప్లీనరీ సమావేశం తర్వాత ప్రారంభమవుతుందని ఇప్పటికే ప్రకటించారు. గతంలో జగన్ ప్రజా సంకల్ప యాత్ర పేరుతో 2017 నుంచి 2019 వరకు 3,648 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. 341 రోజులలో 134 నియోజకవర్గాల గుండా పాదయాత్ర సాగింది. ఈ సారి పాదయాత్ర కూడా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయిలో ప్రజలతో మాట్లాడుతూ సాగుతుందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పాదయాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తుందని, ప్రత్యేకించి రైతులు, మహిళలు, యువత, మరియు వెనుకబడిన వర్గాల సమస్యలపై దృష్టి సారిస్తుందని జగన్ చెబుతున్నారు. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో జూఖీఅఖ 151 నుండి 11 సీట్లకు పడిపోయింది. జగన్ తన పార్టీని పునరుద్ధరించేందుకు ఈ పాదయాత్ర మాత్రమే మార్గంగా భావిస్తున్నారు. పాదయాత్రకు ముందు, జగన్ జిల్లా స్థాయి పర్యటనలు చేపడతారు. ఏపీ రాజకీయాల్లో పాదయాత్రలకు ఓ ప్రత్యేక మైన స్థానం ఉంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేయడం ద్వారా 2014లో అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ప్రతి ఎన్నికకు ముందు ప్రతిపక్ష నేతలు పాదయాత్ర చేయడం కామన్‌గా వస్తోంది. 2009లో చంద్రబాబు పాదయాత్ర చేయ లేదు కానీ.. బస్సు యాత్ర చేశారు. అయితే ఆ ఎన్నికల్లో టీడీపీ గెలవలేక పోయింది. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు పాద యాత్ర చేశారు. ఆ సమయంలో జగన్మోహన్ రెడ్డి జైల్లో ఉన్నారు. జగన్ మోహన్ రెడ్డికి బదులుగా ఆయన సోదరి షర్మిల రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పాదయాత్ర చేశారు.

కానీ టీడీపీ విజయం సాధించింది. ఆ తర్వాత 2019 ఎన్నికల కోసం జగన్ పాదయాత్ర చేశారు. ఆయన ఘన విజ యం సాధించారు. మళ్లీ 2024 ఎన్నికల కోసం టీడీపీ కోసం నారా లోకేష్ పాదయాత్ర చేశారు. టీడీపీ ఘన విజ యం సాధించింది. అదే ట్రెండ్ ను కొనసాగిస్తూ.. రెండేళ్ల పాటు పాదయాత్ర చేయాలని జగన్ నిర్ణయించుకున్నారు.

# జిల్లాల ఫ్రీ బస్సులతో నష్టం రాదా..

**ఒంగోలు – సూర్య వాస్తవం**




ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు పదిహేనో తేదీ నుంచి అమలు కానుంది. గత ఎన్నికలకు ముందు ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు కల్పిస్తామని కూటమి పార్టీ నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఉచిత బస్సుకు ముహూర్తం ఖరారయింది. అయితే ఉచిత బస్సు ప్రయాణం కేవలం జిల్లాలకు మాత్రమే పరిమితం చేయడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని బస్సు సర్వీసుల్లో అమలు చేస్తుంటే, ఏపీ ప్రభుత్వం మాత్రం కేవలం జిల్లాలకే పరిమితం చేయడం ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి..

గతంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కాదు. గత ప్రభుత్వం ఇరవై ఆరు జిల్లాలుగా చేసింది. పది ఉమ్మడి జిల్లాలను ఇరవై ఆరు జిల్లాలుగా మార్చింది. ప్రస్తుతం అవే జిల్లాలు కొనసాగుతున్నాయి. మహి ళలు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయాలంటే ఉమ్మడి జిల్లాలోని తమ వాళ్లు ఉన్న ప్రాంతాలకు కూడా వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. జిల్లాలు కుదించడంతో విస్తీర్ణం కూడా తగ్గడంతో బస్సు ప్రయాణం చేసే వారి సంఖ్య కూడా తక్కువగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఆర్టీసీకి కాని, ప్రభుత్వానికి కానీ పెద్దగా నష్టం ఉండదు. ఉదాహరణకు ప్రకాశం జిల్లాలోని అద్దంకి బాపట్ల జిల్లాలో ఉంది. కానీ అద్దంకి ప్రజలు ఎక్కువగా ఒంగోలు వస్తుంటారు. కానీ ఒంగోలుకు అద్దంకికి చెందిన మహిళలు రావాలంటే ఉచిత ప్రయాణం కుదరదు. అంటే ప్రభుత్వానికి కూడా పెద్దగా భారం అని పించదు.

బస్సుల్లో కూడా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాదిరిగా రద్దీ ఉండదు. బస్సుల సంఖ్య పెద్దగా పెంచాల్సిన పని కూడా ఉండదు. ఎందుకంటే పని ఉంటేనే మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తారు. ఒకవేళ జిల్లా దాటి ప్రయాణించాలంటే ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఆటో కార్మికుల నుంచికూడా ప్రభుత్వానికి అసంతృప్తి పెద్దగా ఎదురు కాదు. ఎక్కువగా జిల్లాల్లో గ్రామాల మధ్య ఎక్కువగా షేరింగ్ ఆటోలు తిరుగుతుంటాయి. కానీ జిల్లాలో అయితే పరవాలేదు. కానీ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆర్టీసీ బస్సు అయినా ఒకటే..ఆటో అయినా ఒకటేనన్న ధోరణి ఆటోమేటిక్ గా కనపడుతుంది. మొత్తం మీద ఉచిత బస్సు పెద్దగా భారం లేకుండా ప్రయాణం సాగిస్తుందని అనుకోవాలి.

# ఆ ఐదుగురిపై వేటు ఖాయమా...

**విజయవాడ – సూర్య వాస్తవం**




ఏపీ క్యాబినెట్లో మార్పులు తప్పవా? ఓ ఐదుగురు మంత్రుల ఉద్వాసన తప్పదా? వారిపై సీఎం చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నారా? వారి పనితీరు మారడం లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు అలానే ఉన్నాయి. నిన్న జరిగిన క్యాబినెట్ భేటీలో చంద్రబాబు మంత్రుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పదే పదే పని తీరు మార్చుకోవాలని సూచించినా.. కొందరి తీరు మారకపోవడంపై ఆయన తీవ్ర అసహనంతో ఉన్నట్లు సమాచారం. రోజులు లెక్కబెట్టుకోవాలని.. మీ స్థానంలో కొత్త మంత్రులు వస్తారంటూ ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఓ ఐదుగురిపై తప్పకుండా వేటు వేస్తారని టాక్ ప్రారంభం అయ్యింది.ప్రస్తుతం ఏపీ క్యాబినెట్లో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. మిగతా 24 మంది మంత్రుల్లో.. జనసేన నుంచి ముగ్గురు.. బిజెపి నుంచి ఒకరు ఉన్నారు.. టిడిపి నుంచి 19 మంది మంత్రి పదవులు నిర్వర్తిస్తున్నారు. అయితే మెగా బ్రదర్ నాగబాబును క్యాబినెట్ లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే నాగబాబు ఎమ్మెల్సీ అయ్యారు. ఆయనను మంత్రివర్గంలోకి తీసుకోవడం ఖాయంగా తేలింది. మరోవైపు మరో పదవిని బిజెపి కోరుతోంది. ఇంకోవైపు ఓ ముగ్గురు మంత్రుల పనితీరు బాగాలేదు. మరో ఇద్దరి తీరుపై ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ఐదుగురిని తొలగించి మంత్రి వర్గాన్ని విస్తరిస్తారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి విషయంలో సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. చంద్రబాబు అనుకున్న స్థాయిలో ఆయన పని చేయడం లేదని తెలుస్తోంది. ఇంకోవైపు గోదావరి జిల్లాకు చెందిన ఓ మంత్రి తీరుపై కూడా అనేక రకాల వివాదాలు ఉన్నాయి. ఆయనను సైతం మారుస్తారని టాక్ ప్రారంభం అయ్యింది. రాయలసీమ జిల్లాకు చెందిన ఓ మంత్రి వ్యవహార శైలి కూడా బాగాలేదని చంద్ర బాబుకు ఫీడ్బ్యాక్ వచ్చింది. ఆయనను సైతం మార్చేస్తారని తెలుస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరిన ఓ నేత మంత్రి పదవి దక్కించుకున్నారు. టిడిపి శ్రేణులను ఆయన పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. సో ఓ ఐదుగురు మంత్రులకు పదవి గండం పొంచి ఉందన్నమాట. ఏపీలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. అప్పుడే మంత్రివర్గ విస్తరణ చేపడతారా? మంత్రులను తొలగిస్తారా? అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. చాలామంది సీనియర్లు మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. తమకు మంత్రి పదవి లభిస్తుందని ఆశతో ఉన్నారు. అయితే సామాజిక సమీకరణలతో పాటు రాజకీయ కోణంలో ఆలోచించి మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉంటుంది.


ఓ పదిమంది వరకు సీనియర్లు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. అనవసరంగా ఇప్పుడు తేనె తుట్టను కదిలించి ఇబ్బందులు తెచ్చుకోవడం ఏమిటన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# నేను మాటల మనిషిని కాదు..పని చేసి చూపిస్తున్నా

- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- టీడీపీ అధ్యక్షుడు, పరిశీలకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే
- 30ఏళ్లుగా సమస్యగా ఉన్న డంపింగ్ యార్డును తరలిస్తున్నాం
- తొలి ఏడాదిలో 118కోట్లతో అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 11:** వైసిపి నాయకుల్లా తాను మాటలు మనిషిని కాదని, పని చేసి చూపిస్తున్నానని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందుకు ఏడాది పాలనే నిదర్శనమని ఆయన వ్యాఖ్యా నించారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన అనంతపురం నగరంలోని శ్రీనివాస్ నగర్ లో పర్యటించారు. వినాయక దేవాలయం వద్ద నుంచి ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, అనంతపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకుడు లక్ష్మీనారాయణలతో కలిసి ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమైంది. ముఖ్యంగా తల్లికి వందనం, పింఛన్లు వంటి పథకాల మీద మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాలనీలోని కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ జగన్ రెడ్డి వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారన్నారు. అమరావతితో మూడుముక్కలాట ఆడి, రాజధాని ఏది అని చెప్పుకోలేని పరిస్థితి తీసు కొచ్చా



రన్నారు. పోలవరాన్ని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని.. ఇప్పుడు అంచనాలు రెట్టింపు అయ్యాయన్నారు. వీటన్నింటినీ ఏడాది కాలంలోనే గాడిలో పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. గతంలో రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను కూడా పెండింగ్ పెట్టా రన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ చెల్లింపులు చేశా రన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిధులు కేటాయించి మళ్లీ పూర్వ వైభవం తెచ్చారన్నారు. ఏడాది కాలంలోనే 9.50 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు, 8.50 లక్షల ఉద్యోగాలు తీసుకువచ్చారన్నారు. అలాగే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 118 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న డంపింగ్ యార్డ్ తరలింపు తో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నడిమివంక, మరువవంక ప్రొటెక్షన్ వాల్స్ కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రుద్రంపేట, 80 ఫీట్ రోడ్లను నిర్మించామన్నారు. వైసిపి నాయకులులా మాటలు చెబుతూ కాలం గడిపే నాయకుల మేం కాదన్నారు. మాట ఇచ్చామంటే అది చేసి చూపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు కృష్ణం రఘు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గాజుల ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, కార్పొరేటర్ బాలాంజనేయులు, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, మారుతి ప్రసాద్, జనార్దన్, రమాదేవి, తాటి మధు, శ్రీకాంత్, లక్ష్మి నారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనంత కలెక్టరేట్‌ను ముట్టడించిన సచివాలయ ఏఎన్ఎంలు

- బదిలీ కౌన్సెలింగ్ జరిగినా ఆర్డర్ కాపీల జారీలో జాప్యం
- మళ్ళీ రీ కౌన్సెలింగ్ ప్రచారంతో ఆందోళనలో ఆరోగ్య కార్యకర్తలు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తీరుపై మండిపాటు



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 11:** అనంతపురంలోని కలెక్టరేట్‌ను సచివాలయ ఏ.ఎన్.ఎంలు ముట్టడించారు. జూన్ 30న బదిలీలకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఈబీ దేవి..ఆర్డర్ కాపీలు ఇవ్వకుండా జాప్యం చేయడాన్ని వారు తప్పుబట్టారు. వెంటనే బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ను ముట్టడించారు.జాప్యం వల్ల జాబితా తారుమారు అయ్యే ప్రమాదముందని వారు అనుమానం, ఆందోళన వ్యక్తం చేసారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మంది ఏ.ఎన్.ఎంలు తరలివచ్చి ఆందోళనలో భాగస్వాములయ్యారు.

# వడ్డీ వ్యాపారస్తుల నుండి రక్షించండి



**రాప్తాడు-సూర్య వాస్తవం ,జులై 11:** అనంతపురం నగరంలోని ఐలమ్మ కాలనీకి చెందిన ఎస్.మహబూబ్ భాషా టీ హెూటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాజీవ్ కాలనీ ప్రాంతంలో అధిక వడ్డీ వ్యాపారస్తుల వేధింపులు ఒత్తిడి హింస భరించలేక బలవంతంగా వ్యాస్మోలిన్ తాగి చనిపోవాలని ఆత్మహత్య ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.బాధితుడు భాషా మాట్లాడుతూ తనకు ఏమైనా జరిగితే పెద్దన్న రామాం జినేయులు వీళ్ళ వేధింపులు భరించలేక బలవంతంగా వ్యాస్మోలిన్ తాగి చనిపోవాలని అనుకున్నాను. నేను చనిపోతే నా భార్య కుమారుడు అనాథలు అవుతారని కావున పోలీసులు కేసు రిజిస్టర్ చేసి తనను తన కుటుంబాన్ని కాపాడాలి అని అన్నారు.అధిక వడ్డీ వ్యాపారస్తుల వేధింపులు నుంచి రక్షించాలని మీడియా ద్వారా తెలియజేశారు.



# ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై సమీక్ష

**సిద్ధవటం - సూర్యవాస్తవం, జూలై 11:** మండల కేంద్రమైన సిద్ధవటం తాహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల తాహసిల్దార్ ఆకుల తిరుమల బాబు మాట్లాడుతూ... ప్రతి రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, ఇతర పథకాలు పొందాలంటే కచ్చితంగా ప్రతి రైతుకు ఏపీ ఫార్మల్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏపీ ఫార్మల్ రిజిస్ట్రేషన్స్ చేసినవి ఎప్పటికప్పుడు లాగిన్‌లో వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యువతకు ఖతర్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 11:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఖతర్ లోని నిర్మాణ రంగంలో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపు ణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ చదివి టిఐజి ఏఆర్సి ఆర్సి మల్టీ వెల్డర్ మరియు టిఐజి మరియుఏఆర్సి వెల్డర్ (సి.ఎస్) పనిలో 4 ఏళ్ల అనుభవం ఉండాలని ఆ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాంట్రాక్ట్ ఉద్యో గాల కోసం 24 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుష అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. నెలకు 1,800 నుంచి 2,200 వరకు ఖతర్ రియాల్స్ (రూ. 52 వేల నుంచి రూ.62 వేల వరకు) జీతం ఉంటుందని. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాసం వంటి ఏర్పాట్లను కంపెనీ యాజమాన్యం చెల్లిస్తుం దని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 9988853335పై 10అంకెల నెంబర్‌ను సంప్రదించాలని ప్రకటనలో కోరారు. అభ్యర్థులు ఈ నెల 31 వ తేదీ లోపు www.naipunyam.apgov.inలో నమోదు చేసు కోవాలని సూచించారు.



# ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తుల దుకాణాలు సోదాలు



**గుత్తి-సూర్య వాస్తవం,జులై11:** గుత్తి పట్టణం లో - కేంద్ర రాష్ట్ర ప్ర భుత్వాల ఆదేశాల మేరకు పట్ట ణము యందు మున్సిపల్ కమీ షనర్ బి.జ బ్బార్ మియా ఆధ్వ ర్యంలో ప్లాస్టిక్ పై నిషేధంపై దుకా ణాలు,వ్యాపార సంస్థలలో సోదాలు నిర్వహించారు.ఈ సో దాలలో షాపుల యందు ప్లాస్టిక్ అమ్మకం చేస్తున్న యజమానుల నుండి రూ.5100 జరిమానా విధించారు మరియు 10కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకు న్నారు.ఈ రోజు నుండి పట్టణ ము యందు సచివాలయ శానిటేషన్ సెక్రెటరీలు ద్వారా ప్లాస్టిక్ నిషేధం పై సోదాలు నిర్వహిస్తు న్నామని తెలియ జేస్తూసోదాలలో ప్లాస్టిక్ వినియోగం చేసే షా పు యజమానులకు హెచ్చరికలుగా ప్లాస్టిక్ కవర్ల బదులు జనుముతో తయారు చేసిన సంచులు మాత్రమే అమ్మాలని ఆదేశించా రు.వ్యాపారస్తులకు, పట్టణ ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి గా మున్సిపా లిటీ వారు చేపట్టిన ప్లాస్టిక్ నిషే ధం సోదాల కార్యక్రమంలో అందరూ సహకరించి ప్లాస్టిక్ నిషేధం అమలుకు అందరూ సహకరించా లని ఈ ప్రకటన ద్వారా తెలియజే శారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహ బూబ్బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికళ్ళు,శానిటేషన్ సెక్రెటరీలు,మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక జనాభా దేశానికి అవరోధం

- చిన్న కుటుంబం- చింతలేని కుటుంబం
- పిహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి



**చెన్నూరు-సూర్య వాస్తవం, జూలై 11:** అధిక జనాభా పెరుగుదల ద్వారా దేశ ప్రగతికి అవరోధం కలగడమే కాకుండా ప్రజలు ఎన్నో సవాళ్లను, ఆర్థిక ఇబ్బందులను, ఎదుర్కోవడం జరుగుతుందని అధిక జనాభా వల్ల అవరోధాలు తప్ప, ఆశించిన ఫలితాలు దక్కవని పి హెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ సాయి చందన, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ ,డాక్టర్ రాజశేఖర్ లు అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని పి హెచ్ సి నుండి గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, అధిక జనాభా వల్ల ఆర్థిక ఇబ్బందులే కాకుండా ఎన్నో అనార్థాలను, ఎన్నో సవాలను, ఎన్నో ఇబ్బందులను అనుభవించాల్సి వస్తుందని అధిక జనాభా వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని పాటించాలని, చిన్న కుటుంబ చింతలేని కుటుంబం అంటూ వారు నినాదాలు చేశారు. అధిక జనాభా వల్ల అనర్థాలు తప్ప, ఆర్థిక వనరులు ఉండవని వారు తెలియజేశారు. అమ్మాయి వివాహ వయసు 18 సంవత్సరాలు అబ్బాయి వివాహ వయసు 21 సంవత్సరాలు ఉండాలని అలా కాకుండా చిన్న వయసులోనే వివాహాలు చేయవద్దని వారు ర్యాలీ ద్వారా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ప్రణాళిక బద్ద మైన మాతృత్వం కోసం గర్భధారణల దారుణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అంతరం ఎంతో అవసరమని ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు జనాభా నియంత్రణ పాటించాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం చెన్నూరు పాత బస్టాండ్ నందు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

# మండలాల మహాసభను జయప్రదం చేయండి



**రాప్తాడు-సూర్య వాస్తవం ,జులై 11:** నేటి సమాజంలో అన్యాయాలకు అక్రమాలకు దౌర్జన్యాలకు గురైన ప్రజల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాటం చేస్తున్నది భారత కమ్యూనిస్టు పార్టీ నే అని మండల కార్యదర్శి ఆర్ రవీంద్ర పేర్కొన్నారు. రాప్తాడు మండలం బండమీద పల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సభను నిర్వహించారు.ఈ సంధర్భంగా మాట్లాడుతూ రాప్తాడు ఆత్మకూరు అనంతపూర్ రూరల్ మండలాల మహాసభను కందుకూరు గ్రామలో ఈనెల 27,28 తేదిల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. 27న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ హాజరవుతారు. అలాగే 28న ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నాము. గత 3 సంవత్సరాల కాలం పాటు నిర్వహించిన కార ్యక్రమాలు చర్చించి రాబోయే 3సంవత్సరాల భవిష్యత్తు కార్యాచరణను చేపడ తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎం చలపతి శాఖ సహాయ కార్యదర్శి ఆదెప్ప నాగరాజు ఏ రాజన్న నారాయణస్వామి శేఖర్ బి.రాజన్న, సూర్యనారాయణ ఇటిక నల్లప్ప మల్లన్న ఓబులపతి అంజప్ప లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

## - డాక్టర్ ప్రవీణ్ కుమార్

**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 11:** మండలంలోని పొన్నవోలు కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పొన్నవోలు కొత్తపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన కలిగే కష్టనష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆడపిల్లకు సరైన వయసులో వివాహం చేయాలన్నారు. మహిళ తల్లి కావడానికి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే తల్లి కావాలని అప్పుడే తల్లి, బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఆడపిల్లకు చిన్న వయసులో వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలు తల్లిదండ్రులు చిన్న వయసులో వివాహం చేయకూడదని బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదవుతాయని వివరించారు. వాతావరణంలో మార్పుల వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు సోకుతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సమస్యలపై వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీ నరసమ్మ, సూపర్వైజర్లు, లక్ష్మీదేవి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ గట్టుపల్లి సుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కమ్యూనికేషన్,

# సాఫ్ట్ స్కిల్స్ అవగాహన కోసం వర్క్ షాప్ నిర్వహణ

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 11:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో( అటానమస్) ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థుల కోసం కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ అంశాల ప్రాముఖ్యత, ఆవశ్యకతపై శుక్రవారం నాడు వర్క్ షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఏఆర్డిఓ ఐ టి సొల్యూషన్స్ ఆధ్వర్యంలో, ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా ఆర్టెక్ ఇన్ఫో, బెంగళూరు సంస్థ హెచ్ఆర్ రిక్రూటర్ జావిద్ ఖాన్ పటాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలని, గమ్యాన్ని చేరడానికి అంకిత భావం ,కృషి ,పట్టుదల ధనాత్మక ఆలోచన, ఒత్తిడిని జయించడం మరియు మంచి నడవడికతో అడుగులు వేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పాత్ర ఉద్యోగ అన్వేషణలో కీలకమని, భావవ్యక్తీకరణ నైపుణ్య అభివృద్ధి తో విషయాన్ని ఎదుటివారికి క్లుప్తంగా వివరణ ఇవ్వడం, ఆత్మన్యూనతా భావాన్ని తొలగించుకుని కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటే విజయం మీ వెంటే ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూ స్కిల్స్ మరియు తరచుగా ఇంటర్వ్యూ సమయంలో ఎదురయ్యే ప్రశ్నలు , వాటికి సమాధానాలు పై విద్యార్థుల సందేహాలను నివృత్తి





చేశారు. శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ %వీ%.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఇంజనీరింగ్ మరియు పాలిటెక్నిక్ విద్యార్థులకు మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్ ,అర్థమెటిక్,రీజనింగ్ అంశాలపై అందిస్తున్న ప్రత్యేక శిక్షణను కళాశాలలోని డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుచుకుని ఉన్నత స్థానాలు అందుకోవాలని సూచి ంచారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, అంకితభావంతో చదువు కుని లక్ష్యాన్ని చేరుకోవాలని కళాశాలలో నిర్వహిస్తున్న ప్రతి అవగాహనా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ వివిధ విభాగాల అధిపతులు ,అధ్యాపకులు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# దేవాలయ భూములను పరిరక్షించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 11 :-** జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ ను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 2,903 ఎకరాల వరకు దేవాలయ భూములు ఆక్రమణలకు గురి కావడం జరిగిందని, వాటిని ఆక్రమణల నుంచి తొలగించి పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో దేవాదాయ శాఖ భూములు ఎన్ని ఉన్నాయి, అవి సాగులో ఉన్నాయా లేదా, ఎంత భూమి సాగులో ఉంది అనేది చూసుకొని, అన్ని భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. దేవాలయాల భూములనుంచే దేవాలయానికి ధూప, దీప, నైవేద్యానికి అవసరమైన నిధులు సమకూరడం జరుగుతుందన్నారు. దేవాలయాల భూములను మండల ఇంచార్జిల ద్వారా కౌలుకు ఇచ్చేలా చూసి వాటిని సాగులోకి తీసుకురావాలని, భూములను సాగు చేసే కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి దేవాలయాల భూములను భూసేకరణ చేయగా, వాటికి సంబంధించిన పెండింగ్లో గల నష్టపరిహారం వచ్చేందుకోసం చర్యలు చేపట్టాలన్నారు. అన్ని దేవాలయాల భూములను లీజుకి ఇచ్చేలా చూడాలని, అందులో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎండోమెంట్ గుంతకల్ ఈవో మఠం మల్లికార్జున, కసాపురం ఏఈఓ, ఈవోలు, ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ లు, తహసీల్దార్ లు పాల్గొన్నారు.

### వైఎస్ జగన్మోహన్ రెడ్డి

# మేధస్సు నుండి ఉద్భవించిన పథకం అమ్మ ఒడి

**- ఆ పథకాలకు తన కొడుకే సృష్టికర్త అంటూ చంద్రబాబు డబ్బాలు కొట్టుకోవడం బాధాకరం**
**- వైయస్సార్ ఎస్ యు విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు పసుపులేటి సాయి దత్త, -కమలాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి**




**చెన్నూరు- సూర్యవాస్తవం, జూలై 11:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లికి వందనం రూపకర్త తన కుమారుడు లోకేష్ అంటూ డబ్బాలు కొట్టుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎవరో చేసిన దానిని తన ఖాతాలో వేసుకోవడం బాధాకరమని వైఎస్ఆర్. ఎస్‌యు.జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పసుపులేటి దత్త సాయి, కమలాపురం నియోజకవర్గ వైయస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి, కడప నియోజకవర్గం వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు శివారెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ ఎర్రసాని నిరంజన్ రెడ్డిలు అభివర్ణించారు...ఈ సందర్భంగా వారు శుక్రవారం చెన్నూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, అమ్మ ఒడి,తో పాటు అనేక రకాలైనటువంటి సంక్షేమ పథకాలను ఐఏఎస్ అధికారుల సహాయసకారంతో తన తెలివితేటలతో రూపుదిద్దిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని ఈ విషయం ప్రజలందరికీ తెలుసని అలాంటిది ఇటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అటు ఐఏఎస్ అధికారుల అపారమైనటువంటి అనుభవంతో తెలివితేటలతో ప్రజలకు మంచి మంచి పథకాలను అహర్నిశలు కష్టపడి పథకాల అమలుకు తమ మేధస్సుకు పదును పెట్టి ఆ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, ఐఏఎస్ అధికారులను గుర్తు చేయకపోగా ఆ క్రెడిట్ అంతటినీ తన కుమారుడు లోకేష్ కు అంటగట్టడం ఎంతవరకు సబబు, ఎంతవరకు న్యాయం అంటూ వారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రశ్నించారు. ఈ రకంగా ఆయన మాట్లాడడం చూస్తుంటే ముఖ్యమంత్రి సూర్యచంద్రాజులకు సైతం స్వయంప్రకాష్ట శక్తిని నేనే కనిపెట్టి వారిని ప్రకాశించండి అని చెప్పినంత ఆశాస్పదంగా ఉందని వారు ఎద్దేవా చేశారు.

అయిన ఆయన తన మోసకారి మాయమాటలతో ప్రజలను నమ్మించగల సమర్థుడని ఇలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ జన్మలో కూడా చూడలేరని వారు అన్నారు.గతంలో ఇలానే బ్యాడ్మింటన్ పీవీ సింధు మెడల్ సాధించినటువంటి నేపథ్యంలో ఆవిడకు బ్యాడ్మింటన్ కోర్సు తనే నేర్పినట్లు తన వల్లే ఆమె బ్యాట్మెంటన్ నేర్చుకున్నట్లు, తనే ఆ విధంగా ఆమెను ప్రోత్సహించినట్లు చంద్రబాబు నాయుడు ప్రగల్బాలు పలకడం మనం చూసాము. ఇటువంటి మోసగారి గడిచినటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉన్నటువంటి పథకాలను కేవలం పేర్లు మాత్రమే మార్చగలిగాడు గానీ ప్రజల మనసుల్లో ఉండిపోయిన అమ్మ ఒడి అనేటువంటి పేరును ఎప్పటికీ చేరిపి వేయలేరని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందాలని ముఖ్య ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టినటువంటి అనేకమైనటువంటి పథకాలకు కేవలం పేర్లు మారుస్తూ వాటిని అదే విధంగా అమలు చేస్తున్నందుకు ఈ ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలుపుతా ఉన్నామని వారు తెలిపారు.

రానున్నటువంటి ఎన్నికల్లో వైస్సార్సీపీ ప్రజల మనసుల్లో సుస్తీర్ణమైన స్థానాన్ని సంపాదించుకొని బలమైనటువంటి మెజారిటీతో పాటు అత్యధిక అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలను కైవసం చేసుకోవడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఇకనైనా ఈ ముఖ్యమంత్రి ఈ మోసకారి మాటలను మానుకొని ప్రజలకు ఏవైతే సూపర్ సిక్స్ పథకాలు హామీ ఇవ్వడం జరిగిందో వాటిని ప్రజలకు అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వానికి హితవు పలికారు.

# డెంగ్యూతో మహిళ మృతి


**గార్లదిన్నె- సూర్య వాస్తవం, జులై 11 :** డెంగ్యూ జ్వరంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. బుక్కరాయసముద్రం మండలం పి కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ చాందిని ని



ఒకటిన్నర సంవత్సరము క్రితం కల్లూరు గ్రామానికి చెందిన షేక్ సాదిక్ తో వివాహమై రెండు నెలల పాప కూడా ఉన్నది.ఈ నెల ఆరో తేదీన ఆమెకు జ్వరం రావడంతో పామిడి ప్రభుత్వాసుపత్రిలో చూపించగా డెంగ్యూ జ్వరం అని తెలడంతో అనంతపురంలోని సవేరా ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మరి ఒకసారి పరీక్ష నిర్వహించారు. డెంగ్యూగా నిర్ధారణ కావడంతో అక్కడే రెండు రోజులపాటు చిక్సితలు అందించారు. అప్పటికీ జ్వరం తగ్గకపోగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈమెకు భర్త, రెండు నెలల కుమారుడు ఉన్నారు. మృతురాలు భర్త సాదిక్ కూలి పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భార్య మరణంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తన రెండు నెలల కుమారుడుకు తల్లి లేని లోటు ఎవరు తీరుస్తారని ఆవేదన చెందాడు.

# ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవి

**పామిడి- సూర్యవాస్తవం, జులై 11:** ఆషాడ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా పామిడి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో వాసవి మాతృ మండలి ఆధ్వర్యంలో లలిత దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. లలిత సహస్ర నామ కుంకుమ అర్చన, 108పసుపు కొమ్ములతో లలిత అష్టోత్తర పూజలు పూజలు చేశారు. అనంతరం కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని పల్లకిలో కొలువు తీర్చి ప్రాకరోత్సవం చేశారు. అనంతరం ఉంజల్ సేవ నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందించారు మాతృ మండలి అధ్యక్షులు నాగ వల్లీ, కార్యదర్శి కీర్తి ఆధ్వర్యంలో జరిపారు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### - వినాయక ఉత్సవ సమితి జిల్లా కార్యదర్శి గోవర్ధన్ నాయుడు

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూలై 11:** ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే గణేష్ ఉత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అన్ని మండలాలు, గ్రామాల పరిధిలోని నిర్వాహకులు సన్నద్ధం కావాలని కర్నూలు జిల్లా శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శి గోవర్ధన్ నాయుడు కోరారు. శుక్రవారం ఆయన పత్తికొండలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 27వతేదీన జరిగే వినాయక చవితి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఉత్సవ సమితి నిర్వాహకులు సిద్ధం కావాలని కోరారు. మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతి, కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. చివరి ఘట్టమైన వినాయక నిమజ్జన వేడుకలో ఎక్కడా అపశృతిజరగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సూచన మేరకు ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు ఉత్సవ మండపాల నిర్వాహకులు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు.



# నేడు విద్యుత్ అంతరాయం

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం జులై 11:** నేడు పత్తికొండ పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలలో రెండో శనివారం కారణంగా విద్యుత్ అంతరాయం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందని కావున ప్రజలు లందరూ, ముఖ్యంగా అగ్రికల్చర్ రైతులు ఈయొక్క విద్యుత్ అంతరాయమునకు సహకరించవలసిందిగాపత్తికొండ ఏఈ( అసిస్టెంట్ ఇంజనీర్ విద్యుత్ శాఖ) కోరారు.




# చీటింగ్ కేసులో మదనపల్లె యువతిని అరెస్ట్ చేసిన కేరళ పోలీసులు

**మదనపల్లె -సూర్య వాస్తవం జులై 11:** చీటింగ్ కేసులో మదనపల్లె యువతిని కేరళ పోలీసులు అరెస్టు చేసినట్లు మదనపల్లె వన్ టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సిఐ మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లె నక్కల దీన్నె తండాలో ఉంటున్న సాయిబాబా కుమార్తె రోహిణి(27) కేరళలో ఓ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. వ్యాపార లావ్యాధులలో భాగంగా కంపెనీ డబ్బు 2.10కోట్లు భాగస్వామి ఏ2 తో కలిపి చీట్ చేసి ఏ2 అకౌంట్ ఖాతాకు వేసుకొని స్వాహా చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న రోహిణి వారెంట్ పై వచ్చి కేరళ పోలీసులు నక్కల దీన్నె తండాలో ఉన్న రోహిణి అరెస్టు చేసి కేరళకు తరలించి నట్లు చెప్పారు.



# ఉచిత అంబులెన్స్‌లు ప్రారంభించిన ఎమ్మెల్యే





తిరుపతి-సూర్య వాస్తవం, జూలై 11: రాజాష్ ఆచ్చారి, జేఎంసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు ఉచిత అంబులెన్స్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఉదయం పద్మావతి మెడికల్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఎంతో దూరం నుంచి స్విమ్స్ కు వచ్చే పేదలు అంబులెన్స్ వినియోగానాకి వేల రూపాయలు చెల్లించ లేక ఇబ్బంది పడుతుండటంతో జనసేనాని పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాజేష్ ఆచ్చారి బృందం, జేఎంసి ట్రస్ట్ ఉచిత అంబులెన్స్ లు ప్రారంభించాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. పేదలకు ఈ అంబులెన్స్ లు ఎంతో ఉపయోగపడుతాయని ఆయన చెప్పారు. డిజిల్ ఖర్చు, డ్రైవర్ బత్తా మినహా ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన పని లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, బాలిశెట్టి కిషోర్, తిరుత్తుణి వేణుగోపాల్, దూది శివ, పగడాల మురళీ, కొండా రాజ్మోహన్, బాబ్జీ, జానకిరామ్ రెడ్డి, శ్రావణ్, లక్ష్మీ, రవి, చరణ్ , లోకనాథం, దుర్గం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల విద్యార్థులకు " యాంటీ డ్రగ్ అవేర్నెస్ "పై అవగాహన



అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 11: జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు " యాంటీ డ్రగ్ అవేర్నెస్ " పై త్రీటౌన్ పోలీసులు అవగాహన చేశారు. ఈసందర్భంగా ఆయా త్రీటౌన్ సి.ఐ శాంతిలాల్ మాట్లాడారు. గంజాయి, తదితర మత్తు పదార్థాలు వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడమే కాదు ప్రాణాపాయం తలెత్తి జీవితాలు నాశనమవుతాయన్నారు. మత్తు పదార్థాల జోలికెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉద్యోగాలే లక్ష్యంగా ఇప్పటి నుండీ సిద్ధం కావాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే దేహాన్ని మనకు తెలియకుండానే అవి పీల్చిపిప్పి చేస్తాయి. అంతేకాదు తనపై నియంత్రణ కోల్పోయి విచక్షణారహితంగా ప్రవర్తించేలా చేస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాల జోలికెళ్ల రాదని సి.ఐ తెలియజేశారు.

## రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన మంత్రి మండిపల్లి



రాయచోటి/రామాపురం- సూర్య వాస్తవం, జూలై 11: అన్నమయ్య జిల్లా రామాపురం మండలం, కుమ్మరపల్లి గ్రామ పరిధిలోని మన్నేరు వాండ్లపల్లె నివాసి తెలుగుదేశం పార్టీ కార్యకర్త మన్నేరు వెంకటేశ్వర్లు కోడలు లత ఇటీవల మరణించడంతో శుక్రవారం వారి ఇంటి వద్దకు వెల్లి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు పరిచినరాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అందరి సమక్షంలో మరణిం చిన లతా కుటుంబానికి 100000/- రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ సందర్భంగా మరణించిన తెలుగుదేశం కార్యకర్త లత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతాభివందనములు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

## లోతువాని గుంట సమస్యల పరిష్కారానికి కృషి

### - ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ





నాయుడుపేట- సూర్య వాస్తవం, జులై 11: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని లోతువానిగుంట ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజ యశ్రీ అన్నారు. శుక్రవారం నాయు డుపేట మున్సిపాలిటీలోని భూప య్య కాలనీ,బీడీ కాలనీ,లోతువాని గుంట ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు,అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లోతవానిగుంటలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ కాలువ అయిన విన్నమాల కాలువ చెత్తా,చెదారాలు,పిచ్చి మొక్కలతో నిండి అస్తవ్యస్తంగా ఉండడంతో డ్రైనేజీ నీరు పోయే వీలు లేక దుర్గంధ భరితంగా తయారైందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు.అలాగే స్మశాన వాటికకు వెళ్లే దారి సరిగ్గా లేదని వివరించారు.అందుకు స్పందించిన ఎమ్మెల్యే స్వయంగా విన్నమాల కాలవ, స్మశానవాటిక దారిలను పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విన్నమాల కాలువ పూడిక తీయించడం తోపాటు స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,నాయకులు వినుకొండ ధనంజయ, జువ్వలపాటి మస్తాన్,బిరదవాడ నారాయణ,మల్లాం రవికుమార్,పలుకూరు ముత్యాలయ్య,మొండెం బాబు, చేవూరు చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో విద్యుత్ అంతరాయం




నాయుడుపేట - సూర్య వాస్తవం జూలై 11: నాయుడుపేట పట్టణంలోని 33/11కేవీ సబ్స్టేషన్ నుండి వెళ్లే అన్ని 11 కెవి ఫీడర్ల లో అత్యవసర మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 09 :00 గంటల నుండి 12:30 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని నాయుడుపేట విద్యుత్ శాఖ ఏఈ ఈ ఎన్. శివశంకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. నాయుడుపేట పట్టణంలోని అగ్రహార పేట, పిచ్చిరెడ్డి తోపు, అమరా గార్డెన్, చంద్రమౌళి నగర్,పిచ్చిరెడ్డి తోపు విజయ గణపతి టెంపుల్ , టీచర్స్ కాలనీ,బాలాజీ గార్డెన్,గాంధీ మందిరం,జైహింద్ కాలనీ,పొగ గొట్టం,గరిడి వీధి,కోళ్ల ఫారం,ఆవని హోమ్స్ ,కాళహస్తి బైపాస్ రోడ్,హెచ్ పి పెట్రోల్ బంక్ ,రాజగోపాల పురం,శ్రీరామ్ నగర్ ,అశోక్ నగర్,జువ్వల పాలెం , విన్నమాల గేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.పట్టణ ప్రజలు విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## అగ్రహారపేటలో వైభవంగా శ్రీ సాయిబాబా నగరోత్సవం



నాయుడుపేట - సూర్య వాస్తవం జూలై 11: నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటలో వెలసి ఉన్న శ్రీ సాయిబాబా మందిరంలో గురు పూర్ణిమ వేడుకల అనంతరం శుక్రవారం శ్రీ సాయిబాబా నగరోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురు పౌర్ణమి సందర్భంగా అగ్రహార పేట సాయిబాబా మందిరం వద్ద శ్రీ సాయిబాబా చిత్రపటానికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. అనంతరం నగరోత్సవం నిర్వహించారు. నగరో త్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని,తీర్థ ప్రసా దాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ మురళీధర్ రెడ్డి, అధ్యక్షులు దాసరి ప్రభాకర్ నాయుడు,ఉపాధ్యక్షులు మారం రెడ్డి ముత్యాల రెడ్డి, కొణిజేటి వెంకటేశ్వర బాబు, కార్యదర్శి చింతపూడి శ్రీధర్ కుమార్,కోశాధికారి పూనాటి తిరుమల నాయుడు,సంయుక్త కార్యదర్శులు గంధవల్లి సిద్దయ్య, కలత్తూరు జయచంద్ర రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎం.చంద్రశేఖర్, పలువురు కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేట శ్రీపోలేరమ్మ హుండీ ఆదాయం రూ.3,36,238



నాయుడుపేట - సూర్య వాస్తవం జూలై 11: నాయుడుపేట గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు ద్వారా 3, 36, 238 రూపాయలు వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధీర్ బాబు తెలియజేశారు. శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,కార్యనిర్వాహణాధికారి రవికృష్ణ, సిబ్బంది నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఎస్వీ వేద వర్సిటీ వ్యవస్థాపక వేడుకలు వివాదాస్పదం

### - టీటీడీ పెద్దలను ఆహ్వానించని వైకాపా ప్రభుత్వ విసి
### - స్థానిక కూటమి కూటమి నేతలను ఆహ్వానిస్తూ రాజకీయ మైండ్ గేమ్ కు తెర తీసిన వీసీ సదాశివమూర్తి

తిరుపతి-సూర్య వాస్తవం, జూలై 11: టీటీడీకి అనుబంధంగా ఏర్పాటైన శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం జరగనున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమంగా వీసీ పదవిలో కొలువుదీరిన రాణి సదాశివమూర్తి ఒంటెద్దు పోకడలతో ఆవిర్భావ వేడుకలు వివాదాస్పదంగా మార నున్నాయి. ఈ వేడుకలకు టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంలకు ఆహ్వాన పత్రిక అందించలేదన్న విమర్శలు వర్సిటీలో జోరందుకున్నాయి. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక శుక్రవారం సామాజిక మధ్యమంలో దర్శనమవ్వడంతో వర్సిటీ వర్గాలతో పాటు టీటీడీ అధికార వర్గం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ ఆహ్వాన పత్రికలో టీటీడీ పెద్దల పేర్లు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. గత 19 సంవత్సరాలుగా వేదవర్సిటీ ఆవిర్భావ వేడుకలు ఉన్నతాధికారుల సమక్షంలో జరిగేవి. తొలిసారిగా టీటీడీ పెద్దలకు ఆహ్వానం లేకపోవడాన్ని విద్యార్థి పరిశోధక అధ్యాపక వర్గం ప్రశ్నిస్తోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో వీసీ పోస్టుకు నోటిఫికేషన్ లేకుండా సెర్చ్ కమిటీ లేకుండా అర్హతలు లేకున్నప్పటికీ రాణి సదాశివ్ మూర్తి వీసీ పదవిలో ఆశీనులయ్యారు. ఈ అక్రమ నియామకంపై కూటమి ప్రభుత్వం ఇటీవల విజిలెన్స్ విచారణ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో టీటీడీ పెద్దలను ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానించకుండా నగరానికి చెందిన ఇతర నాయకులను ఈ సభకు ఆహ్వానించి కూటమి ప్రభుత్వ నాయకుల్లో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కూటమి ప్రభుత్వానికి చెందిన పలువురు నాయకులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి తనపై జరుగుతున్న విచారణ నుంచి తప్పించుకోవడానికి వేదవర్సిటీ వీసి ఆవిర్భావ వేడుకలను వాడుకుంటున్నారన్న విమర్శ వర్సిటీలో జోరుగా వినిపిస్తోంది. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక వేద వర్సిటీ రిజిస్టార్ గా నియమితులైన ఆచార్య భాస్కరుడుకు కనీస సమాచారం లేకుండా వీసీ కార్యాలయం ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తోంది. ఈ ఆవిర్భావ వేడుకల్లో వీసీ అనుసరిస్తున్న మైండ్ గేమ్ రాజకీయాలను ఇప్పటికే టీటీడీ విజిలెన్స్ పసిగట్టినట్లు సమాచారం.

**గతమంతా శారదా పీఠం.. ప్రస్తుతం కంచి మఠం..**

వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ శారదా పీఠం ఆడిందే ఆటగా సాగింది. అప్పట్లో విశాఖ శారదా పీఠం స్వరూపానంద సరస్వతి స్వామి అండతో, ధర్మారెడ్డి మద్దతుతో అక్రమంగా వీసీ పోస్టు సంపాదించుకున్న సదాశివమూర్తి ప్రస్తుతం ఉన్నట్టుండి తన పదవిని కాపాడుకోవడం కోసం కంచి మఠాన్ని రంగంలోకి దింపాలన్న ఆలోచనతో శనివారం నాటి ఆవిర్భావ వేడుకలకు కంచి మఠం శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

## కందారపు రాజమ్మకు పలువురు నివాళులు



తిరుపతి-సూర్య వాస్తవం, జూలై 11: సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కందరపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మ గురువారం అనారోగ్యంతో మరణించారు చెందారు. ఆమె పార్థివ దేహానికి పలువురు నివాళులర్పించారు.

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మూలం రమేష్, తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శి వి నాగరాజు, చిత్తూరు జిల్లా సిపిఎం కార్యదర్శి వి గంగరాజు, సిపిఎం తిరుపతి నగర శ్రేణులతో పాటు,టిడిపి ,జనసేన, వైఎస్ఆర్సిపి పార్టీ నేతలు రాజమ్మకు నివాళులర్పించారు.

## హౌసింగ్ జగన్నాథ్ రెడ్డి ఆత్మహత్య



అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 11: శింగనమల మండలం కొరివిపల్లి గ్రామానికి చెందిన జగన్నాథ్ రెడ్డి అనే వ్యక్తి తన పొలంలో విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు జగన్నాథ్ గతంలో అనంతపురం హౌసింగ్ డిపార్ట్మెంట్లో కంప్యూటర్ ఆపరేటర్గా పని చేశారు.అయితే ఆ తరువాత వచ్చిన ఓ అధికారిని వేధిం పులు తాళలేక అతను ఉద్యోగం నుంచి తప్పుకున్నారు.అందరితో కలివిడిగా, కలుపుగోలుగా ఉండే జగన్ ఇలా బలవన్మరణం చెందడం అందరినీ కలచి వేసింది.

# షూటింగ్ పూర్తి చేసుకున్న 'ఓజీ'

**- సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీ విడుదల**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు అదిరి పోయే అప్ డేట్ వచ్చింది. పవన్ కల్యాణ్ నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ' చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా పవన్ కల్యాణ్ సరికొత్త, పవర్ ఫుల్ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ పోస్టర్ అభిమానులలో జోష్ మరింత పెరిగింది. దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పవన్ కల్యాణ్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుందని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ముంబై నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ కథలో పవన్ కల్యాణ్ ఒక శక్తివంతమైన, ఇంటెన్స్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. విడుదలైన పోస్టర్‌లో పవన్ కల్యాణ్ మాస్ లుక్‌లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. "అన్ని షూటింగ్‌లు అయిపోయాయి.. ఇప్పుడు థియేటర్ల వంతు.. ఓజీ ఆశ్చర్యపరచబోతోంది." అంటూ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఈ కీలక అప్‌డేట్‌ను అందించారు. ఇది సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ పాత్రలో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు, ఇది సినిమాకు మరింత ఆకర్షణను జోడిస్తోంది. అర్జున్ దాస్, శ్రీయా రెడ్డి, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'ఓజీ' చిత్రాన్ని 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఇటీవల రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, తన సినిమా షూటింగ్‌లను వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.

# పవన్‌కు రాజకీయ రంగం సరిపోతుంది: శృతి హాసన్

**- ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శృతి హాసన్**
**- గబ్బర్ సింగ్ చిత్రంతో తన కెరీర్ మలుపు తిరిగిందని వెల్లడి**
**- సెట్స్ పై పవన్ ఎప్పుడూ వ్యవసాయం, గ్రామాల గురించి మాట్లాడేవారని వివరణ**



అందాల హీరోయిన్ శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన గబ్బర్ సింగ్ చిత్రంతో తన కెరీర్ మలుపు తిరిగిందని వెల్లడించారు. వాస్తవానికి ఆ చిత్రంలో తాను నటించనని చెప్పానని, అయితే ఆ పాత్రలో తనను తప్ప మరెవ్వరినీ ఊహించుకోలేదని దర్శకుడు హరీశ్ శంకర్ తను ఒప్పించారని శృతి వివరించారు. తనకు తొలి విజయం దక్కింది టాలీవుడ్ లోనే అని స్పష్టం చేశారు. ఇక, గబ్బర్ సింగ్ హీరో పవన్ కల్యాణ్ గురించి చెబుతూ... సెట్స్ పై ఆయన ఎక్కువగా రైతుల గురించి, గ్రామాల గురించి మాట్లాడుతుండేవారని ఆమె తెలిపారు. పవన్ కు రాజకీయ రంగం సరిగ్గా సరిపోతుందని శృతి అభిప్రాయపడ్డారు. కాగా శృతి హాసన్ ప్రస్తుతం తమిళంలో తలైవా రజనీకాంత్ సరసన కూలీ చిత్రంలో నటిస్తున్నారు.

# 'కేడీ ది డెవిల్' టీజర్ విడుదల



కన్నడ నటుడు ధృవ సర్జా కథా నాయకుడిగా వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్న చిత్రం 'కేడీ ది డెవిల్'. దీనిని టీజర్ విడుదల వేడుక శు క్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ధృవ సర్జా, రీష్మా నానయ్య, కీలకపాత్రలు పోషించిన సంజరుదత్,శిల్పాశెట్టి హాజ రయ్యారు. సంజయ్ దత్ మాట్లాడుతూ... కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంకీ, సుప్రిత్ ఈ సినిమాను బాగా నిర్మిస్తు న్నారన్నారు. శిల్పా శెట్టి మాట్లాడుతూ, ముంబైలో విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇది ట్రెండ్ అవుతోందని అన్నారు. హైదరాబాద్ తర్వాత కొచ్చి, బెంగళూరు, చెన్నైలో ఈవెంట్స్ చేయ బోతున్నట్టు కేవీఎన్ ప్రొడక్షన్ బిజినెస్ హెడ్ సుప్రీత్ తెలిపారు.



# సుమిత్, ప్రీతికి స్వర్ణాలు

**- 7వ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్**




**బెంగళూరు:** 7వ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సుమిత్ అంటిల్, ప్రీతిపాల్ స్వర్ణ పతకాలను చేజిక్కించుకున్నారు. శ్రీకంఠీరవ స్టేడియంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఓపెన్ పారా అథ్లెటిక్స్‌లో రెండుసార్లు పారా ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన సుమిత్ అంటిల్ పురుషుల జావెలిన్ త్రో(ఎఫ్-12, ఎఫ్-16)విభాగంలో 72.25మీ. విసిరి పసిడి ఒడిసి పట్టాడు. మంజిత్ 54.56 మీ. రజతం ప్రదీప్ కుమార్ కాంస్య పతకాన్ని చేజిక్కించు కున్నాడు. ఇక మహిళల 100మీ. (టి35, టి37, టి42) విభాగం పరుగులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రీతిపాల్ అగ్ర స్థానంలో నిలిచింది. గుజరాత్‌కు చెందిన మోర్టీరు 17.20 సెకన్లలో గమ్యానికి చేరి రజత పతకానికి పరిమితం కాగా.. ఆమెకంటే 0.15సెకన్లతో ప్రీతి బంగారు పతకం కైవసం చేసుకుంది. హర్యానాకు చెందిన అవని 20.40సెకన్లు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకానికి పరిమితమైంది.

# లార్డ్స్ లో బుమ్రా 'పంచ్'...

**- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ లో 387 ఆలౌట్**
**- భారత్-ఇంగ్లండ్ మూడో టెస్టు**
**- నేడు ఆటకు రెండో రోజుఐదు వికెట్లతో రాణించిన బుమ్రా**



భారత్-ఇంగ్లండ్ మధ్య లార్డ్స్ వేదికగా జరుగు తున్న మూడో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్, రెండో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ (104) అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు. ఇంగ్లండ్ ఓవర్ నైట్ స్కోరు 251-4తో రెండో రోజు ఆట ప్రారంభమైన తర్వాత, భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీశారు. జో రూట్ పట్టుదలగా ఆడి తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని నమోదు చేసుకున్నాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (44)తో కలిసి ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే, శతకం పూర్తి చేసుకున్న వెంటనే రూట్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేసి భారత్‌కు పెద్ద ఊరటనిచ్చాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లలో వికెట్ కీపర్ జామీ స్మిత్ (51) వేగంగా ఆడి అర్ధశతకం సాధించాడు. చివర్లో బ్రైడన్ కార్స్ (56) కూడా విలువైన పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ 380 పరుగుల మార్కును దాటగలిగింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా (5/74) తన అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. కీలకమైన ఐదు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్‌ను భారీ స్కోరు చేయకుండా నిలువరించాడు. మహమ్మద్ సిరాజ్ (2/85), యువ బౌలర్ నితీశ్ కుమార్ రెడ్డి (2/62) చెరో రెండు వికెట్లు తీసుకోగా, రవీంద్ర జడేజాకు ఒక వికెట్ దక్కింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారన్న దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలి

- వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 11:** ప్రజలు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో హెల్త్ పారామీటర్స్, వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులు, ప్రజల నుండి సేకరించిన అభిప్రాయాలు, తదితర అంశాలపై, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష తదితరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డయాబెటిస్, హైపర్ టెన్షన్, మేటర్నల్ హెల్త్, నియోనేటల్ హెల్త్, అభ ఐడి మ్యాపింగ్, తదితర అంశాలలో అన్ని పిహెచ్సిలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనిచేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పని తీరు, రక్త పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నారా లేదా, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలిగారా లేదా వంటి అంశాలపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తుందని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లు ప్రజలతో మానవతా దృక్పథంతో మెలగాలని, తమ సిబ్బందికి కౌన్సిలింగ్ చేసి సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగేలా చూడాలని, ప్రజల నుండి సిబ్బంది యొక్క ప్రవర్తనపై అభిప్రాయాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని పీహెచ్సీలలో మెడికల్ అధికారులు ప్రజలతో మంచి ప్రవర్తనతో మెలిగినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం లేదని వారు తమ ప్రవర్తనను మార్చుకొని ప్రజలతో సఖ్యతగా మెలగాలన్నారు. వైద్య సేవలు మిగిలిన సేవలు కంటే ప్రజలకు అత్యవసరమని చాలా ఉన్నతమైన సేవ అని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్సీలను సందర్శించేలా చూడాలన్నారు. మెడికల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో డాక్టర్ లక్ష్మీ నరసయ్య, డిపిఎమ్ఓ డాక్టర్ రియాజ్ బేగ్, ప్రోగ్రామ్ అధికారి ఆర్ బి ఎస్ కే డాక్టర్ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని

# ప్రారంభించిన మంత్రి, ప్రభుత్వ విప్

- రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి 300 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపించాం
- రాష్ట్రానికి మంత్రినైనా అనంతపురం జిల్లా అభివృద్ధికి మొదటి కూలీగా పని చేస్తానన్నారు.
- ఉరవకొండ నియోజకవర్గానికి ఏ విధంగా అయితే ప్రాధాన్యత ఇస్తున్నామో రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి కూడా అదే విధంగా ప్రాధాన్యత ఇస్తున్నాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**కనేకల్- సూర్యవాస్తవం,జూలై 11:**

రాయదుర్గం నియోజ కవర్గంలోని కనేకల్ మండలం ఎర్రగుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక - ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవ హారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ , రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుపాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి 300 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ఉరవకొండ నియో జకవర్గానికి ఏ విధంగా అయితే ప్రాధాన్యత ఇస్తున్నామో రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి కూడా అదే విధంగా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తనకు స్థానిక ప్రాధాన్యతలు తెలుసని, కష్టమైనా కూడా మాల్యం బ్రిడ్జిని మంజూరు చేసి పనులు చేస్తున్నామన్నారు. రైతులు బాగుండాలని దాదాపు 35 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి హెచ్.ఎల్.సి కెనాల్ లో నియో జకవర్గం నుంచి పెన్నోబుళం డ్యాం వరకు అత్యవసర పనులను చేస్తున్నామని తెలిపారు. ఖజానాని ఖాళీ చేసి భయంకరమైన పరిస్థితుల్లోకి తీసుకు వెళ్లారని, కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే చేసి చెప్పింది భారతదేశంలో ఇంక అప్పులు తీసుకోలేని పరిస్థితి ఏ రాష్ట్రానికి ఉంది అంటే అది ఒకే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రమే అని తేల్చిచెప్పిందన్నారు. ప్రతి నెల ఖర్చులకు డబ్బులు సర్దుబాటు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. గ్రామాల్లో మహిళలు ఎలాగైతే ఖర్చుల కోసం ఇబ్బంది పడుతుంటారో అదేవిధంగా రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు సమకూర్చడం కూడా సమస్యగా ఉంటుందన్నారు.

గత ప్రభుత్వం దివాలా తీయించినా ముఖ్యమంత్రి చంద్రబాబు చతురత, అనుభవంతో రాష్ట్రం ప్రగతి బాట పట్టిందన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పెద్దపెద్ద కంపెనీ ద్వారా పెట్టుబడులు పెట్టించి ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి అనునిత్యం శ్రమిస్తుంటారని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్ర ప్రజలకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. పేదోళ్ల కష్టాలు తెలిసిన వారు కాబట్టే తాము ఎంత శ్రమ ఉన్న భుజాన వేసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తున్నారు కాబట్టే కష్ట కాలంలో నిలబడగలుగుతున్నామన్నారు. గతంలో కంటే తల్లికి వందనం పథకాన్ని అధికంగా ఇస్తున్నామని, పెన్షన్లను ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచామని, అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే రైతులకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. గతంలో కంటే తాము సంక్షేమాన్ని రెట్టింపు చేశామని, అభివృద్ధిని పదింతలుగా చేస్తున్నామన్నారు. ఐదేళ్లు హెచ్.ఎల్.సి పనులు చేపట్టలేదని, తాము పనులు చేపట్టామని, ఎర్రగుంట గ్రామంలో 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు వేశా మన్నారు. రాష్ట్రానికి మంత్రినైనా అనంతపురం జిల్లా అభివృద్ధికి మొదటి కూలీగా పని చేస్తానన్నారు. కరువు ప్రాంతమైన మన జిల్లాలో బీదల కష్టాలను కొంచమైన తీర్చగలిగితే చాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జిల్లా రుణం తీర్చుకునేందుకు పనిచేస్తామన్నారు. ముఖ్యంగా తన పూర్వీకుల రాజకీయ నేపథ్యం రాయదుర్గం నియోజకవర్గంతో ముడిపడిందన్నారు. అందువల్లే ఉరవకొండతో పాటు రాయ దుర్గంతో గట్టి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ప్రభుత్వ విప్ , రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజాహితమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో ఎంపికైన ప్రభుత్వం పేదరికాన్ని దూరం చేయటానికి ఎంతగానో శ్రమిస్తోందన్నారు.

ఐదేళ్ల వైకాపా దుష్టపాలన హెచ్.ఎల్.సి వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో హెచ్.ఎల్.సి అత్యవసర పనులకు అనుమతులు లభించాయన్నారు. వారందరి చలవవల్లే గండ్లు, పైపింగ్లు పడే పరిస్థితి నుంచి బయట పడగలుగుతున్నామన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ తో తనకున్న వ్యక్తిగత పరిచయాలతో సకాలంలో తగిన సూచనలు సలహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తుంటారని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రితో పాటు పయ్యావుల అనేక నిద్రలేని రాత్రులు గడుపుతుంటారన్నారు. నిధుల సమీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద కష్టంగా మారిందన్నారు. అయినప్పటికీ జిల్లాను ఏదో విధంగా అభివృద్ధి పరచాలనే దృఢ లక్ష్యంతో మంత్రి నిధులు సమకూర్చగలుగుతున్నారన్నారు. ఇంత గడ్డు పరిస్థితుల్లో కూడా రూ.3800 కోట్లతో హంద్రీనీవా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ఆగిపోయిన జీడిపల్లి భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ పనులు పునః ప్రారంభించామన్నారు. ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువలకు నిధులు సమకూర్చి సకాలంలో పూర్తి చేయడానికి మంత్రి తోడ్పాటు అందించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న దశలో రాయదుర్గాన్ని కూడా ప్రతిపాదన చేయించూ కొమ్మని ముందే అప్రమత్తం చేశారన్నారు. నేమకల్లు రిజర్వాయర్ తో పాటు హెచ్.ఎల్.సి ఆధునికరణ పనులను పూర్తి చేసుకోవడానికి మంత్రి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎర్రగుంట గ్రామంలో ఒక కోటి 72.99 లక్షల రూపాయల వేయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి, విప్ ప్రారంభించారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత గ్రామంలోని ఎన్నేరంగస్వామి ఆలయం దగ్గరలోని హెచ్.ఎల్.సి కెనాల్ లో అండర్ టన్నెల్ (యుటి) పనులను మంత్రి, విప్ పరిశీలించారు. కాలువకు త్వరలో నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో పనుల పురోగతిని పరిశీలించారు. ఇప్పటికే చాలావరకు పనులు పూర్తి చేశామని, కాలువ నీటి పంపిణీకి ఎలాంటి సమస్య ఎదురు కాదని ఇంజనీర్లు వివరించారు. ఈనెల 15 నుంచి హెచ్.ఎల్.సి, హంద్రీనీవా కాలువలకు నీటిని సరఫరా చేసుకోవడం జరుగుతోందని మంత్రి ప్రకటించారు. ఈలోగా మిగిలిన పనులను కూడా పూర్తి చేసి సక్రమ నీటి పంపిణీకి సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం

- వైసీపీ ప్రభుత్వంలో ప్రజల హక్కులను కాల రాశారు
- జగన్ ప్రభుత్వంలో పేదలకు అన్యాయం జరిగింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 11:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గౌరవ మంత్రివర్యులు మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం దూదేకుల పల్లెలో నిర్వహించడం జరిగింది ప్రజలు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ప్రతి ఒక్కరూ జేజేలు పలుకు తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు తల్లికి వందనంతో తల్లులు సంతోషంగా ఉన్నారు దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ తో మహిళలుకు వంటింటి కష్టాలు తొలగిపోయాయి అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పెంపుతో వృద్ధులు వితంతువులు దివ్యాంగులకు ఆర్థిక భరోసా దొరికిందని ఆనందంగా ఉన్నారని తెలిపారు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అర్హులకు అందరికీ అందివ్వాలని ఎంతో శ్రద్ధతో న్యాయం జరిగేదిశగా వెళుతున్నారని తెలిపారు గత వైసిపి ప్రభుత్వంలో ప్రజల హక్కులను కాలరాశి జగన్ ప్రభుత్వంలో పేదలకు అన్యాయం జరిగిందని తెలిపారు. జగన్ నియంతృత్వంతో రాష్ట్ర అభివృద్ధి అధోగతి పాలయిందని చెప్పారు.ప్రతి ఇంటిలో చంద్రబాబు పరిపాలనకు ఆశీస్సులు అందుతున్నాయని దుర్మార్గం పరిపాలన వెళ్ళిపోయిందని ఇప్పుడు ఆనందంగా ఉన్నామని ప్రజల నోటి నుండి వినిపిస్తున్న మాట ఇదే అన్నారు. ఈ కార్యక్రమంలో అమావాస్యరెడ్డయ్య తబ్రేస్ రోఫా బలరాం తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తా

- అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రకటన
- కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా సచివాలయ ఏఎన్ఎంలకు కలెక్టర్ హామీ

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 11:** అనంతపురం కలెక్టరేట్‌ను ముట్టడించిన సచివాలయ ఏ.ఎన్. ఎంలకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ గట్టి హామీ ఇచ్చారు. జూన్ 30న నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌లో బదిలీ అయిన తమకు ఉత్తర్వులు ఇవ్వకుండా అనంతపురం వైద్య ఆరోగ్యశాఖ అధికారిడాక్టర్ ఈబీదేవి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నట్లు ఆరోపిస్తూ కలెక్టరేట్ ముట్టడించారు. ఆ తరువాత కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ను కలసి తమ సమస్యను విన్నవించారు. కలెక్టర్ వినోద్ కుమార్..ఏ. ఎన్.ఎం ల సమస్యలను సావధానంగా విన్నారు. ఆ తరువాత వైద్య ఆరోగ్య శాఖాధికారి ఈబీ దేవితో మాట్లాడారు. సోమవారంలోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. లేకపోతే హెల్త్ డైరెక్టర్ తో మాట్లాడి న్యాయం చేస్తానని సచివాలయ ఏ. ఎన్.ఎం లకు కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో వారంతా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# అప్పుల బాధతో యువతి ఆత్మహత్యాయత్నం




**మదనపల్లి - సూర్య వాస్తవం, జూలై 11:** అప్పుల బాధ తాళలేక ఓ యువతి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం మదనపల్లె లో జరిగింది. బాధితురాలు, ఆమె కుటుంబీకుల కథనం మేరకు.. పట్టణంలోని పసిని కొండకు చెందిన రెడ్డప్పరాణి సొంత ఇల్లు కట్టి బాడుగకు ఇచ్చి మగ్గాలు నేసేందుకు స్థానిక వీవర్స్ కాలనీలో అద్దె ఇంటిలో కాపురం ఉంటున్నారు. కాగా రెడ్డప్ప భార్య రాణి(32), తన భర్త కువైట్లో ఉన్నప్పుడు స్థానికంగా ఉన్న వడ్డీ వ్యాపారులు పలువురు దగ్గర అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చలేదని రుణదాతలు ఒత్తిడి చేయడంతో మనస్థాపం చెంది, ఎలకల మందు తాగి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి బాధ్యతరాలని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి వైద్యం అందించడంతో కోలుకుంటూ ఉంది. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )